నైజగుణం

శ్రీ ఆర్. సూర్యనారాయణ

తెల్లటి బట్టలు వేసుకుని వీధిలోకి బయలుదేరాడు మురారి. వీధిగేటు దాటి రోడ్డుమీదికి అడుగు పెడుతూండగానే, భుజంమీద యేదో పడ్డట్టయి ప్రక్కకి తల త్రిప్పాడు. తెల్లటి చొక్కా మీద డాగుపడింది. మొహం చిట్లించి, తలపైకి యెత్తిచూస్తే పైనున్న రావిచెట్టు కొమ్మమీద కాకి అప్పుడే యెగిరి పోవడం కనిపించింది. ఓసారి మళ్ళీ భుజం చూసుకుని లోపలికి పోవడం కోసం వెనక్కి తిరిగాడు. కాని వెనకాలనుంచి :

"అంతేరా! మురీ! దాని నైజగుణమే అంత! శుభ్రమైన తెల్లటి వాటిని మచ్చపరచి పాడుచేయడమే వెధవ కాకిమూక పని. అలాంటి వారు మనుష్యుల్లోనూ ఉంటారు. నైజగుణాన్ని ఎవరూ తగ్గించలేరు కదా!" అంటూ నరహరిదగ్గరకి వచ్చి, భుజంమీద చేయివేసి లోపలికి దారి తీశాడు. ఇద్దరూ హాల్లో కూర్చున్నారు.

"ఏరా నరీ! కనిపించనే లేదు. ఇంతకాలం నుంచి?"

"ఏం చెయ్యనురా! వెధవది ఆఫీసుపనితోటే సరిపోతోంది. ఒకటే ప్రయాణాలు. నువ్వు యిక్కడికి బదిలీఅయ్యావని తెలిసింది. వచ్చినట్టూ తెలిసింది. ఏదీవచ్చి కలుసుకుందామంటే తీరుబడి అయితేనా?"

"నేను వచ్చిన ఈ వారం రోజులనుంచీ నిన్ను గురించే వాకబుచేస్తున్నా. అంతా క్రొత్త అవడంవల్ల యేం తోచడం లేదు."

"ఊఁ! దానికేంగాని, విశేషాలేఁవిటి? అసలు అక్కడనుంచి బదిలీ ఎందుకయిందిరా ? నువ్వే వచ్చేశావా?"

"నేను రావడం ఏమిటి? వాళ్ళే పంపేశారు. "ఏం"అని అడుగుతావుగా నేనే చెప్పేస్తా! ఏముంది? ఆయనకీ నాకూ పడలేదు. ఆయన చర్యల్నీ విధానాన్ని విమర్శించానుట. 'ట' ఏమిటిలే అన్నమాట నిజం. అందుకని మనస్సులో ఉంచుకుని శెలవలాఖరిని గెంటించాడు."

"అయితే నీ తత్వం మార్చుకోలే దన్నమాట. ఇంకా విమర్శలు వ్యాఖ్యానాలూ చేస్తూనే ఉన్నా వన్నమాట! అయినా..."

"విమర్శ ఏముందిరా! నాకు తోచిన అభిప్రాయం చెప్పడం తప్పా! నేనన్నది అబద్ధమైతేగా."

"అది కాదురా! మురీ! నిజమయినా అప్రియమయితే చెప్పకూడదన్నారు కదురా! ఏమో నువ్వీ పద్ధతి మార్చుకుంటేనే గాని..."

"బాగుపడను. అంతేనా! పోనివ్వరా! నరీ! చదువుకుని, సంస్కారం యేడిసినవాళ్ళం కనక కొన్ని ఆశయాలు, ఆదర్శాలూ ఉండటం అందుకోసం పాటు పడడం సహజం. కాని ప్రపంచం అంతా దానికి వ్యతిరేకంగానే సలహాయిస్తుంది. ఒక్కరూ చేయూతనివ్వరు. ఇంకా శక్తిసామర్థ్యాలున్నాయి. రక్తం వేడిగానే ఉందిగనక ఆశయసిద్ధికోసం వెర్రిగా ప్రయత్నం చేస్తున్నా. కొన్నాళ్లు పోతే, బిగి తగ్గితే అందరిలాగే అవుతానేమో! ఈలోగా ఎందుకు నన్ను నిరుత్సాహపరుస్తారు?"

"ఊఁ! ఇక్కడ ఉద్యోగం ఎలా ఉంది. ఏఁవయినా సరిపడేనా?"

"ఇంకా యేదీ! అవునుగాని, ఆయన ఎవరూ! అస్తమానూ ఎవరినో విమర్శిస్తూనే ఉంటాడు. నల్లగా, సన్నగా, చప్పిదవడలూ..."

ఓహో ! ఆయనా ! శ్రీశైలంగారని. లోయర్ డివిజనులే !"

"అదేఁవిటిరా ఎప్పుడూ వాసుతోనే ఉంటాడు? అందులోనూ ఎదటివాణ్ణి వెధవని చెయ్యడంలో చొరవ ఎక్కువనుకుంటా!"

"పసి గట్టేశావ్! అతని నైజమే అంత. అతని నోటికి జడిసి అంతా ఊరుకుంటున్నారు. అతను ఎందుకు అలా తయారయ్యాడో మన సైకాలజీలో నాకిప్పటికీ సమాధానం దొరకలేదు."

"ఆ చూసిన కాసేపు నాకు అసహ్యం వేసిందంటే..."

"తొందరపడకు. ఆ ఊరులాంటిది కాదు ఈ ఊరు."

అలా మాట్లాడుతూంటే—"మాష్టారూ! అయిదు రూపాయిల చిల్లర ఉంటే యిమ్మందండి మా అమ్మ" అంటూ వచ్చింది ఓ పది పదకొండేండ్ల పిల్ల, సన్నగా, నాజూగ్గా, చామనచాయతో, కోలమొహం. అందకత్తె కాకపోయినా చూడముచ్చటగా ఉంది.

లేదమ్మా! యింట్లోకి వెళ్లి అడుగు. లేకపోతే కావలసిన చిల్లర పట్టుకు వెళ్లు." అని మురారి అనగానే నవ్వుతూ లోపలికిపోయింది.

"ఎవర్రా మురీ!"

"అదిగో. ఆ యింటివారమ్మాయి. వచ్చినప్పటి నుంచీ చనువుగా ఉంటోంది. వట్టివెర్రిబాగులపిల్ల,"

"ఉఁహుఁ! ఒరేయి మురీ! నువ్వీ ఊరికి క్రొత్త. ముక్కుకుసూటి వ్యవహారమే గాని ముందు వెనకలు చూడవు. నా మాటమీద విలువ ఉంటే ఆ అమ్మాయిని చనువు చెయ్యకు. వస్తాను. పనిఉంది. సాయంత్రం పార్కులో కలుసుకుంటావుకదూ?" అంటూ నరహరి హడావిడిగా వెళ్లి పోయాడు. అతను వెళ్లిన దిక్కునే అర్థంకాక చూస్తూ ఉండిపోయాడు మురారి.

నరహరి, మురారీ బాల్యస్నేహితులు. హైస్కూలు చదువూ, కాలేజీ చదువూకూడా కలసే చదివారు. తత్వాల్లోను, అభిప్రాయాల్లో భేదం ఉన్నా యిద్దరి స్నేహానికీ యింతవరకూ అంతరాయం కలగలేదు. కారణం ఒకరిభావాల్ని ఒకరు అర్థంచేసుకోవడమే.

నరహరి ఒకవిధంగా ఆశావాది. జన్మతః అదృష్టవంతుడు. కనక మొదటినుంచీ జీవితాన్ని ఆనందంగా చూడడమే అలవాటయింది అతనికి. దానికితోడు యింతవరకూ అతనికి జీవితంలో ఎటువంటి కష్టం ఎదురుకాలేదు. అంచేత అతనికి అసలు చీకటి అనేది ఉందా అని సందేహం.

మురారి తరహా అందుకు సరీగ్గా వ్యతిరేకం. చిన్నప్పటినుంచీ యేదోరకమైన కట్టుబాట్లు, నియమాల్లో బ్రతకవలసిరావడంవల్ల అతని జీవితం ఒక ప్రత్యేకమైన గాడిలోనే పోతున్నట్లనిపిస్తుంది. అంతేకాక అతనికి జీవితంలో అనుకోకుండా పెద్ద అఘాతం లాంటిది తగలడంతో అతనికి జీవితంలో యింక వెలుగు లేదని, యీ నిరాశతో, దిగులుతోనే యీ జీవితం గడపాలనే నిరాశావాదానికి వచ్చేశాడు. ఇంకేదో విధంగా జీవితాన్ని సుఖమయం చేసుకోవాలనే ఆవేదనలో అతడు కొన్ని ఆదర్శాలు నిశ్చయాలు యేర్పరచుకొని అవి ఆచరించడంలోను, వానిని సాధించడంలో అవిరళకృషి చేయడంలో తన జీవితభగ్నత్వాన్ని కొంత మరిచిపోగలుగుతున్నాడు. అతని ఈ అంతస్స్వరూపం చూడలేనివారికి అతని బాహ్యప్రవర్తన కొంచెం యిబ్బందిగాను విచిత్రంగానూ ఉంటుంది.

మురారినీ, నరహరినీ కలిపిన ముఖ్యవిషయం-యిద్దరికీ ఉన్న సారస్వతాభిలాష, రసజ్ఞత. చదువుకునే రోజుల్లో యిద్దరూ యెన్నో విషయాలమీద రోజుల తరబడి వాదించుకుంటూనే ఉండేవారు. అందులో నరహరి అంతగా చదవకపోడవంవల్ల మురారి వాదనలో ఏకీభవించక తప్పలేదు. మురారికి తనకన్నా ఎక్కువ తెలుసుననే భావనే నరహరిని అతని స్నేహంలో ఉంచింది. మురారికూడా తన కంఠకంటె ఆప్తస్నేహితులు లేకపోవడంవల్ల అప్పుడప్పుడు నరహరికి తన హృదయంలో నిండుకున్న చీకటితెరలు చూపిస్తూ ఉండేవాడు.

అంతకు ముందున్న ఊరునుంచి మురారి ఆ వూరు బదిలీ అయ్యాడు. ఆ ఊరులోనే కొన్నాళ్ళనుంచి ఉంటున్నాడు నరహరి. ఇద్దరూ ఒకే డిపార్టుమెంటు కావడం ఒక అదృష్టం. ఆ వూరు విషయాలు, ఆఫీసు వ్యవహారాలు నరహరికి తెలిసినంతగా మురారికి తెలియవు. పైగా మురారి పైపైవిషయాలు మాత్రమే గ్రహించగలడు, నరహరి కొంత లోపలి విషయాలు కూడా గ్రహించే చాకచక్యం గలవాడు.

ఆ నాడు మురారికి నరహరి అన్న ఆఖరిమాటలే అర్థంకాలేదు. ఆ అమ్మాయిని రానివ్వవద్దంటాడు ఎంచేతో ఎలా చెప్పడం? ఈ వూరు వచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే శాంతమ్మగారు తన భార్యతో పరిచయం చేసుకుంది. అనుభవంలేని తన భార్యకి అన్ని

విషయాల్లోనూ పెద్ద దిక్కుగా ఉంటోంది. వచ్చిన పదిహేను, యిరవై రోజుల్లోనే వారికుటుంబం తోమూ యింత కలిసి మెలసి ఉండడానికి ఏ జన్మాంతరసంబంధమో కారణం అనిపిస్తుంది కూడా. నిజం చెప్పాలంటే యిప్పటి కామె ఒక్కసారీ తన కంట బడలేదు. పిల్లలు తనని చూడకుండా ఒక్కరోజు ఉండలేరు. అలాంటివాళ్ళని ఎలా కాదనడం? సాయంత్రం తెలుసుకోవాలి ఈ విషయం!

2

"ఏమిటిరా నరీ! ప్రొద్దున్న అలా అన్నావ్. ఏం ఆ అమ్మాయిని రానిస్తే..."

"నీకు తెలియవురా తరవాత ఫలితాలు. ఆ అమ్మాయి అమాయికమైనదే. కాని వారి యింటి చరిత్ర..."

"చరిత్ర కేముందిరా. తండ్రి పోయాడు. తల్లే అన్నీ చూసుకుంటూ వస్తోంది. పెద్దబ్బాయి కొంచెం తిక్కరకం. మిగతావాళ్లు చిన్నవాళ్లు. చాలా కలిసి కట్టైనవాళ్లు లాగే ఉన్నారు."

"నీ కంతే తెలుసు. ఆమె గతజీవితం అంత విశుద్ధమైంది కాదు. భర్తపోయిన క్రొత్తలో ఆమెని గురించి చెడ్డగా చెప్పుకునేవారు. ఇప్పటికీ ఎవరిని కదిలించినా ఆకథ చెబుతారు."

"నువ్వు నమ్ముతావా?"

"ఏదీ నిర్ణయించుకో లేక పోతున్నాను. పది మందీ చెబుతోన్నప్పుడు అబద్ధం అవుతుందా అనే అనిపిస్తోంది. కాని పూర్తి విశ్వాసం కలగడం లేదు."

"ప్రజల నైజగుణం నీకూ తెలుసుగా. ఏమీ లేక పోయినా గాలిపోగుచేసి అభాండాలు వేస్తారు. నువ్వుకూడా..."

"నిప్పులేనిదే పొగ వస్తుందిరా?"

"దొరికిందిరా, దొడ్డప్రశ్న. ఎవరు వేసినా అదే ప్రశ్న. సమాధానం రాని ప్రశ్న. ఏదో చూసి పొగ అనుకునో లేక పొగనే కల్పించో అల్లకూడదూ? సరే నువ్వు ఆమెని చూశావా?

"ఆ ఒకటి రెండుసార్లు..."

"ఎన్నేళ్లుంటాయి?"

"ముప్ఫయి దరిదాపు."

"అంటే చిన్నపిల్ల కాదన్నమాటేగా. అప్సర సలా ఉండదుకదూ?"

"............"

"ముప్ఫయేళ్ళ సామాన్య అందకత్తెకి ఆ విధంగా అంటకట్టారంటే ఏమనుకోవాలో అర్థం కావడం లేదు. అయినా ఆమె యేకాంతంగా నివసించడం లేదు కదా. పిల్లలు-అందులో ఎదిగినవాళ్ళుగూడా-ఉన్న తల్లి, తప్పుదారిని పడిందంటే వీలవుతుందా అని. పోనీ అవుతుందనే అనుకున్నా, ఆఒక్క గుణంవల్లా యింక ఆమెలో మంచిగుణాలు, మానవత్వం, ఉపకార లక్షణం ఉండవనీ, ఆమెనింక దగ్గరకు రానియ్యకుండా సంఘంలో దూరంగా ఉంచెయ్యాలనీ అనడం అన్యాయం అంటాను."

"అబ్బబ్బ! నీదంతా వితండవాద నేరా!"

"అవును. దాంతో అందరూ ఏకీభవించరు. పోనీ చదువుకున్నవాడివి నాకు ఆప్తుడివంటివాడివీ నువ్వైనా అర్థ చేసుకుంటేచాలు."

"అంచేత ఆ అమ్మాయిని రావడం మాన్పించలే వన్నమాట."

"ఎలాగరా? వస్తోంటే 'వద్దు పో' అని చెప్పడం యింకా చేతనవడం లేదురా?"

"ఈ ఊరు మంచిది కాదురా. అందుకని...."

"వేస్తే ఆ అభాండం నామీదకూడా వేస్తారు అంతేనా. కానియ్యి నిండా మునిగినవాడికి చలేమిటి?"

* * * *

షికారునుంచి ఇంటికి వస్తూన్నంతసేపూ మురారికి నరహరి చెప్పిన విషయాలే బుర్రలో కదులుతున్నాయి. ఆ ఆలోచనల్లో శాంతమ్మగారే ఎక్కువ స్థానం ఆక్రమించుకున్నారు. ఆమెనిగురించి నరహరి ఎంత చులకనగా మాట్లాడాడు? అసలామె అటువంటిదంటే తను నమ్మలేకపోతున్నాడు. తన భార్యకూడా ఆవిషయంలో ఎటువంటి అనుమానం వెలిబుచ్చలేదు.

అయినా నరహరి అంతగా చెబుతున్న విషయాన్ని తను మనస్ఫూర్తిగా త్రోసివేయలేకపోతున్నాడు. భర్త పోయినక్రొత్తలో ఆమె తప్పటడుగు వేసిందేమో! అప్పటికామె వయస్సు ఏపాతికో ఉండి ఉండవచ్చు. అంతవరకూ అనుభవించిన దాంపత్యజీవిత మాధుర్యం ఆమె వెంటనే మరిచిపోలేకపోయిందేమో?

లేదా అభర్తతో ఆమె హృదయపూర్వకమైన ఆనందం అనుభవించలేకపోయిందేమో! కొందరు మనుష్యులు ఆకలిని అరికట్టుకోలేరు. ఎంత రోగంతో బాధపడుతున్నా, ఎందరు డాక్టరు వద్దని చెప్పినా, అలా చపలత్వంకలవాళ్ళు వాళ్లే బాధపడుతారుగదా మనకెందుకని ఊరుకోకూడదా మిగిలినవాళ్ళు? యిదే తనకి సమాధానంరాని ప్రశ్న. పైగా ఎప్పుడో ఒకసారి కాలుజారిందని యింక ఎల్లకాలమూ అంతేనని యింక ఆ వ్యక్తిలో పశ్చాత్తాపమూ, బాగుపడదామనే కోరిక ఉండదని అనుకోవడం, ప్రస్తుతం ఆవ్యక్తిజీవితవిధానం ఎలాఉందని చూడకపోవడం—యీపొరపాట్లు ఈ లోకం ఎప్పుడు చేయడం మానేస్తుందో కాని.

అలా ఆలోచించుకుంటూ యింటికి వచ్చేప్పటికి శాంతమ్మగారి పాప పదేళ్లది నవ్వుతూ ఎదురువచ్చింది. అనుమాన కళంకిత హృదయం కావడంవల్ల వెంటనే చిరునవ్వుతో ఆమెని ఆదరించలేకపోయాడు. కాని ఆమెలోని అమాయికత్వమూ చిలిపితనం చూసి, తన తెలివితక్కువకి తనే సిగ్గుపడి, ఆ అమ్మాయితో మామూలుగా ఉండగలిగాడు. ఏ మాత్రం కొస్త సావకాశం వచ్చినా శాంతమ్మగారి విషయమే ఆలోచిస్తూ ఉండేవాడు మురారి.

ఒక ప్రక్క ఈ విధంగా ఉంటే రెండో ప్రక్క ఆఫీసులో కూడా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి మురారికి. ఆఫీసులో ఉండే వారి నైజగుణాలు చూస్తోంటే అతనికి ఆశ్చర్యం వేసేది. కొందరు ఎంతసేపూ అధికారి మెప్పుకోసం ఎందుకు ప్రాకులాడుతారో, కొందరు ఎదటి వాడి బాగుచూసి ఎందుకు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారో, కొందరు ఎప్పుడూ, అకారణంగానే ఎందుకు ఎదటివారిని విమర్శిస్తుంటూ ఉంటారో అతనికి అర్థం కాలేదు. పోనీ యిందువల్ల వారేమైన ప్రత్యేక ప్రయోజనం సాధించారా అంటే యేం లేదు. ఇటువంటి వాతావరణంలో తాను తప్పకుండా వేరుచేయబడి విమర్శలకి, అయిష్టాలకీ ఆగ్రహాలకీ గురికావలసి వస్తుందని ఎందుకో అనుమానం వేసింది మురారికి. అందుకని తన ఆదర్శాలు, ఆశయాలు మానుకుని వారితో ఒకడైపోవడమా? నిగ్రహంతో ఎదురునిలిచి కాపాడుకోవడమా తీరనిసమస్య అయిపోయింది అతనికి.

అందులోనూ ఆ శ్రీశైలం ఎందుకు తనమీద అంత యిదిగా ఉంటాడో అర్థంకాలేదు మురారికి. తన డివిజను కాదు. తానెప్పుడూ అతని ప్రస్తావన తేలేదు. తనకీ అతనికీ అంత పరిచయంకావలసిన అవకాశం లేదు. అయినా ఎందుకు అతడు తనని, తన వేషభాషలనీ అంత యిదిగా విమర్శిస్తున్నాడో ఎంత ఆలోచించినా తెగలేదు. చివరికి మొట్టమొదటి రోజున నరహరి చెప్పిన విషయం చటుక్కున జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాడు మురారి.

3

రోజురోజుకీ శ్రీశైలం మురారినిగురించి చేసే విమర్శలు మితిమీరుతున్నాయి. అయినా మురారి లెక్క చేయడంలేదు. తన పనేమో, తన గొడవేమో అనే ధోరణిలో పోతున్నాడు. ఒకరోజున నరహరి హడావిడిగా వచ్చి

"నీమీద పడ్డాడేంరా ఈ శ్రీశైలం? ఒకటే విమర్శలు ఒకటే వ్యాఖ్యానాలు?"

"మామూలేగా?"

"అయితే నే చెప్పడమెందుకు? అంతకంతకీ శృతిమించుతోందనే చెప్పడానికి వచ్చాను. మొన్న ఆవూరు వెడితే శాస్త్రి చెప్పాడు, నిన్నుగురించి వీడు అక్కడ ఒకటే గొడవట. అక్కడ నీ ప్రవర్తన పాడయిపోవడంవల్లనే ఇక్కడికి బదిలీచేశారుట! ఇంకా..."

"అందుకనే ఆ వూరిలో చాలామందికి ఫామిలీ ఫ్రెండ్ అయ్యాను. అయినా నరహరీ! అప్పుడప్పుడు నాకు ఈ విమర్శలు విని మనస్సు పాడుచేసుకోవాలో, లెక్కచేయకుండా తిరగాలో అర్థం కాదురా? ఎంతకాదనుకున్నా, ఏమీలేనిదానికి అపనిందవేశారే అని మనస్సు బాధపడుతూనే వుంటుందిరా? ఆత్మవిశ్వాసం కలవాణ్ని కనక నెట్టుకువస్తున్నా"

"నువ్వు బాధపడతావని నాకు తెలుసురా! ఐనా చెప్పకపోతే నీకు విషయాలు సరిగ్గా అర్థంకావని చెప్పడం. వాడి నైజమే అంత అని చెప్పాను కదరా! అంతేకాదు, ఆ అమ్మాయితల్లి నిన్ను పట్టిందనికూడా అంటున్నాడుట ఒకటిరెండు చోట్ల. ఇదే నలుగురి నోట్లోను..."

"పడుతుందంటావ్. కానియ్యి. ఇంకేంచేస్తాడు?"

"అదికాదురా! పోనీ ఇప్పటికయినా..."

"ఒరేయి నరీ! ఒకమాట చెబుతాను విను. ఎవరి నైజగుణాన్ని ఎవరూ మానరని నువ్వే అన్నావుగా. అకారణంగా ఇలాంటి అపవాదులు లేవదియడంవల్ల దీని అంతం చూడాలనే పట్టుదల యెక్కువౌతోందిరా! సరే తిక్కలక్షణం నా నైజగుణం అని నీకు తెలుసుకదా! కానియ్యి యేం జరుగుతుందో?"

"నీ యిష్టం మరి." అని వెళ్లిపోయాడు నరహరి.

మురారి ఆలోచనలో పడ్డాడు. చివరికి అనుకున్నంతా అయింది. ఈవిషయం తెలిస్తే శాంతమ్మ

గారు ఎంత యిదయిపోతారో? యింక పాప తనింటికి రావడం మానేస్తుందేమో? తనకి కాలక్షేపం అయ్యే అవకాశం ఉండదేమో? అయినదానికి, కానిదానికి ఆదుకునే పెద్దదిక్కు యింక తనకుటుంబానికి ఉండదన్నమాట!

అయినా యీ వాదు వేసేవారు మంచి చెడ్డలు చూడరేమా అని మురారికి ఆశ్చర్యం. తన వయస్సెంత, ఆమె వయస్సెంత? మహా ఉంటే తనకంటె ఆమె రెండుమూడేళ్ళు పెద్దయేమో? అంటే తన అక్కయాడన్నమాట. ఛీ ఛీ మనుష్యులకి అసలు వివక్షణ లేకుండా పోయిందేం? ఈ విషయం ఆలోచిస్తోంటే మురారికి యింకో అనుమానం కూడా బయలుదేరింది. ఈవిషయమే అనోటా, అనోటా తన భార్యకి కూడా తెలిస్తే ఆమెనమ్మితే ఇంక తనుసంసారం? పైన ఊహించలేకపోయాడు. చివరికి యేది యేమయినా సరే శాంతమ్మగారి కుటుంబంతో తనకుటుంబానికుండే పరిచయం పాడవకూడదనే దృఢనిశ్చయానికి వచ్చేశాడు మురారి.

అటు నరహరికూడా అనేకవిధాల యిదయి పోతున్నాడు తన ఆప్తమిత్రునిమీదపడ్డ యీ నీలాప నిందకి. మిగిలిన స్నేహితులు శ్రీశైలం ఎంతఘట్టిగా వాదిస్తున్నా, మురారి అలాంటివాడంటే అతని అంతరాత్మ ఒప్పుకోవడం లేదు. అక్కడికీ, శ్రీశైలాన్ని నరహరి ఎక్కడికక్కడ ఖండించుకుంటూ వస్తూ, మురారిపైన అతనికి యేర్పడిన సురభిప్రాయాన్ని తొలగించడానికి ప్రయత్నించాడు. ప్రతివాదానికీ యేదో విపరీతఅర్థం చెప్పి తన అనుమానాన్ని బలపరచేవాడు శ్రీశైలం. కావలసివస్తే తాను మరో అవినీతిప్రవర్తనని సోదాహరణంగా నిరూపిస్తానని నరహరితో శ్రీశైలం ఛాలెంజి కూడా చేశాడు.

* * * *

ఒకరోజు రాత్రి నరహరి యింటికి హటాత్తుగా వచ్చాడు శ్రీశైలం. తన వాదానికి సాక్ష్యం చూపిస్తానని, అంతకుముందే మురారి శాంతమ్మగారింటికి వెళ్ళినట్టు ప్రబల నిదర్శనం దొరికిందని, తానువచ్చి చూసుకోవచ్చుననీ చెప్పాడు నరహరితో. శ్రీశైలం నైచ్యానికి ఒకప్రక్క కోపం, స్నేహితుని అవస్థకి ఆవేదన ఒక్కసారి పెల్లుబికాయి నరహరికి. వెళ్ళకూడదనుకుంటూనే శ్రీశైలంవెంటనడిచాడు నరహరి. వీధి మొగలోకి వచ్చినతర్వాత శాంతమ్మగారి యింటివైపు పరిశీలనగా చూస్తూ నుంచోమని మురారి ఆయింటిలోంచి రావడం తథ్యమనీ శ్రీశైలం నొక్కి చెప్పాడు. కొద్దిసేపటికి గూడకట్టుతో ఎవరో శాంతమ్మగారింటిలోంచి మురారియింటివైపు రావడం కనపడింది. నరహరికి అనుమానం, శ్రీశైలానికి ఆనందం ఒక్కసారి కలిగాయి. కాని ఆ వచ్చిన వ్యక్తి మురారి యింటిముందు నిలచి "మురారిగారూ!" అని పిలవడం, మురారి బయటకు వచ్చి మాట్లాడ్డం చూసిన నరహరి కోపం ఉండబట్టలేకపోయాడు.

"అయిందా నీప్రతాపం. అతను శాంతమ్మగారి పెద్దబ్బాయి. ఏదో పుస్తకం ఇవ్వడానికి వచ్చాడు. శ్రీశైలం నీకిదేం బుద్ధోయ్? ఎంతసేపు ఎదటివారిమీద అభాండాలు వేయడమే నీబ్రతుకయిందికదా? వాడి పేరుని కళంకపరుస్తే నీకేం వస్తుందోయ్" అని నాలుగూ అనేశాడు.

"అమ్మా! మీవాడా......" అంటూ తప్పుకున్నాడు శ్రీశైలం.

ఆనాటి సంఘటనలో శ్రీశైలానికి కొంచెం చిన్నతనం అనిపించింది. అంచేత తన అనుమానం నిరాధారం కాదని ఎప్పటికైనా నరహరిచేత ఒప్పించాలని అతను శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడు. పట్టుదల ఎక్కువఅవడంవల్ల మురారిప్రవర్తనని మహా నిశితంగా పరిశీలించడం మొదలుపెట్టాడు.

ఒకనాటి సాయంత్రం అప్పుడే చీకటిపడుతూంది శ్రీశైలం నరహరిని హడావిడిగా వెంటబెట్టుకుని వస్తున్నాడు మురారియింటివైపు. నరహరికి అర్థంగావడం లేదు, ఎంత అడిగినా యేం చెప్పడంలేదు శ్రీశైలం. ఆఖరికి వారియింటిముందుకువచ్చాక శ్రీశైలంకటువుగా "మొన్నటిసారి ఆ లచ్చిగాడు చెప్పినమాట పట్టుకుని నీకుసాక్ష్యం చూపించలేకపోయాను. చీవాట్లుతిన్నాను. ఈసారి నాకు స్వయంగా దొరికిందిసాక్ష్యం. శాంతమ్మ యిప్పుడే మురారియింటిలో ప్రవేశించడం నాకళ్ళారా చూశాను. ఈ సమయంలో ఆ మహాతల్లికి మీ ప్రియస్నేహితుడియింట్లో పనేమిటోయ్?"

నరహరి మెల్లిగా అంటున్నాడు.

"నిజమే. నువ్వు చూశావా? అన్యాయంగా ఒకరిని......"

"పిలవోయ్ మీవాణ్ణి. తేలుతుంది భాగోతం"

ఇంకేం అనలేక నరహరి తలుపు తట్టుతూ "మురారీ మురారీ!" అని పిలిచాడు. రెండుమూడుసార్లు పిలిచినతరవాత "లేరండీ" అనే సమాధానం వినిపించింది ఆ గొంతుక మురారిభార్యది కాదని నరహరికి ధృవపడిపోయింది. అయితే మరి ఆ గొంతుక శాంతమ్మగారిదేనా? శ్రీశైలం అనుమానం ... అతనికి మతిపోతోంది. శ్రీశైలం విషపునవ్వు అతనికి దుర్భరం అయిపోతోంది. ఏం చెయ్యడం?

"అదేమిటిరా అక్కడ నుంచుని యేంచేస్తున్నావు?" అనే ప్రశ్నతో తల పైకెత్తారు

యిద్దరూ. రెండు చేతుల్లోనూ మందుసీసాలు, పొట్లాలూ, పళ్లు పుచ్చుకుని మురారి వస్తున్నాడు. శరీర మంతా ఒక్కసారి తేలికయినట్లయింది నరహరికి. కాళ్లక్రింద భూమి తప్పుకుంటూన్నట్లనిపించింది శ్రీశైలానికి.

"అదేమిటిరా?" అని మాత్రం అనగలిగాడు నరహరి.

"మందులురా! రెండురోజులనుంచి మా ఆవిడకి జ్వరం డోకులు. నానాయిబ్బంది పడుతున్నాననుకో. పాపం ఆ శాంతమ్మగారు వీలున్నప్పుడల్లా వచ్చిచూసి ఆదుకుంటున్నారు కనక సరిపోతోంది లేకపోతే..."

"చెప్పావుకాదేంరా? విన్నారా శ్రీశైలం గారూ! రండి మనం వెడదాం." అంటూ లాక్కుపోయాడు నరహరి. మురారి యేం అర్థంకాక తెల్లబోయాడు.

4

కొద్దిరోజుల తరవాత కలుసుకున్నప్పుడు నరహరి, మురారికంతా చెప్పాడు. అతని ఈ అర్థంలేని పగ ఎందుకో అని మురారి ఆశ్చర్యపోయాడు. నరహరే అన్నాడు.

"కొందరు కొందరు మనుష్యులు అంతేరా? ఏం ప్రయోజనం లేకపోయినా ఎదటివారు సుఖంగా ఉంటే ఓర్వలేరు. తేలుకుట్టడానికీ కాకి రెట్టవేయడానికీ కారణం ఎవరు చెప్పగలరు?"

"అదికాదురా మానసికశాస్త్రం ప్రకారం తమ కోర్కెలు తీరనివాళ్లు, అవి ఎదటివారిలో తీరుతున్నట్టు చూసినప్పుడు వారిమీద ద్వేషంతో ఉంటారేమో! అది ఒక్కటే తప్పిస్తే మనిషి మంచివాడిలాగే కనపడతాడు. చాలాబాగా పాడతాడు. మంచి నటకుడు. అయితేనేం..."

"వాడి నడవడిమాత్రం బాగుండి యేడిసింది కనకనా ఎదటివారిని తప్పు పట్టడానికి. అయ్యగారి భాగోతం తెలియనివారి దగ్గర చెప్పు ఈ కబుర్లు."

అంతలోకే శాంతమ్మగారి పాపవచ్చి "మా అమ్మ యేడుస్తోందండి మామయ్యగారూ! ఈ ఉత్తరం మీకు యిచ్చి రమ్మందండి." అంటూ ఒకఉత్తరం యిచ్చి వెళ్లింది. మురారి అందుకుని నరహరికి యిచ్చాడు. చివరిదాకా చదవకుండానే నరహరి ఒక్కసారి గుప్పుమన్నట్టుగా

"ఛండాలుడు. చివరకి ఎంతకి ఒడిగట్టాడు. ఈసారి కనిపించనీ వీడిపని చెబుతాను. ఎదటివాడిమీద. లేవడం అనుకున్నాడు కాబోలు వె......" అని అరిచాడు.

మురారికి అర్థంకాక "ఏమిటిరా?" అని అడిగాడు. సమాధానం చెప్పకుండా ఆ ఉత్తరం అందించాడు. చదువుకున్న మురారి మొహంలో బాధ స్పష్టంగా కనిపిస్తోంది. "పాపం అందుకే యేడుస్తోంది కాబోలు శాంతమ్మగారు, నే చెప్పలేదురా! ఇది కూడా ఒక మానసికవ్యాధి లక్షణం అని, అయినా......" అని అంటూంటే శ్రీశైలం పరుగెత్తుకుంటూ వచ్చాడు. "నరహరీ! నరహరీ! నీ కోసం మీ యింటికి పరుగెత్తాను. బాబ్బాబు ఒక పదిరూపాయలుంటేయిద్దూ నీకు పుణ్యం ఉంటుంది. మా ఆవిడ చావుబ్రతుకుల్లో ఉంది. ఇంజక్షన్ యిస్తేనే గాని......" అంటూ చేతులు పట్టుకోబోయాడు. నరహరి యింక ఉండబట్టలేక పోయాడు.

"పోనియ్యవోయ్ శ్రీశైలం. ఆవిడ పోతేనేం ముందుప్రయత్నాలు చేస్తున్నావుగా! సమాధానం వచ్చేదాకా చూడు."

"వేళాకోళం కాదు నరహరీ! చాలా అవసరం" అని చేతులు పట్టుకున్నాడు శ్రీశైలం. విదలించుకుని:

"ఛీ పాపాత్ముడా! నీ స్పర్శ తగిలితేనే పాపం. దూరంగా ఉండు. నీ నీచగుణంవల్ల ఎందరిని ఉసురు పెట్టావో అది తగలకుండా పోతుందా? ఏమిటే నీచపని?" అని ఉత్తరం చూపించాడు.

శ్రీశైలం యేం మాట్లాడలేక నుంచున్నాడు. అతని ముహంలో ఆవేదన అవమానం కలిసి నల్లగా వ్యాపించాయి. అంతకన్నా నిరాశాజీవి ఉండడనిపించింది మురారికి. చటుక్కున లోపలికివెళ్లి పది రూపాయలనోటు పట్టుకువచ్చి,

"శ్రీశైలంగారూ! యిదిగో పట్టుకువెళ్ళి యింజక్షన్ కొనుక్కురండి. మావాడు కొంచెం విసురుమనిషి. వాడిమాటలు లెక్కచేయకండి." అంటూ అందిచ్చాడు.

శ్రీశైలం తన చెవులని తాను నమ్మలేకపోయాడు. మెల్లగా సంబాళించుకుని వణుకుతున్న చేతులతో బాటు మురారిచేతులు పట్టుకుని శ్రీశైలం:

"మురారిగారూ! మీరు నిజంగా దే..." అని అంటూంటే,

మురారి మాటకి అడ్డువచ్చి,

"ముందు మందు పట్టుకురండి." అంటూ సాగనంపాడు. మెట్లుదిగుతున్న శ్రీశైలం పైగుడ్డతో కళ్ళు ఒత్తుకోవడం చూసి మురారి ఒక్క నిట్టూర్పు విడిచాడు.

అర్థంకాక చూస్తున్న నరహరి భుజంతడుతూ "నువ్వన్నమాటేకదరా? ఎవరి నైజగుణాన్ని ఎవరు మార్చుకోగలరు?" అంటూ లోపలికి తీసుకువెళ్ళాడు.